ప్రజాశక్తి
గురువారం 20 ఫిబ్రవరి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





డిఎస్‌పిని కలిసిన పిహెచ్‌పిలు



ప్రజాశక్తి-నెల్లూరు :కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సభ్యులు నగర డిఎస్‌పి పి.సింధుప్రియను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం నగర డిఎస్‌పి కార్యాలయంలో పిహెచ్‌పి జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ పీ.హెచ్.పిలు ప్రాథమిక వైద్య చికిత్సలకే పరిమితం కాకుండా సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలను చైతన్య పరుస్తుంటామని తెలిపారు. అనంతరం డిఎస్‌పి సింధుప్రియ మాట్లాడుతూ సమాజంలో పీ.హెచ్.పీ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పథకాలనే కాకుండా ప్రజల సమస్యలపై పి.హెచ్.పి లు కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం ఆన్ లైన్ నేరాలు పెరిగిపోతున్నాయని, ముఖ్యంగా అమ్మాయిలు వివిధ ప్రలోభాలకు లొంగి జీవితాలను నాశనం చేసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఆన్ లైన్ సమస్యలపై అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పీ.హెచ్.పి నాయకులు షేక్ సత్తార్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, కే.రామరాఘవయ్య, ఎం.శ్రీధర్ రావు, బి.శంకర్రావు పాల్గొన్నారు.

బక్క చిక్కిన కోడి..!

- భారీగా పడిపోయిన చికెన్ అమ్మకాలు
- ధరలు పతనం...వ్యాపారులు లబోదిబో
- బర్డ్ ఫ్లూపై ప్రభుత్వం స్పందన ఏదీ

రాష్ట్ర వ్యాపితంగా బర్డ్ ఫ్లూ వైరస్‌తో కోడి బక్కచిక్కిపోయింది.. వైరస్ భయంతో చికెన్ వినియోగదారులు తగ్గిపోతున్నారు..భారీగా అమ్మకాలు పడిపోయాయి.. ధరలు తగ్గడం, అమ్మకాలు లేకపోవడంతో వ్యాపారులు లబోదిబో అంటున్నారు...మరో వైపు చికెన్ పకోడీ, హోటల్ వ్యాపారులు.. శుభకార్యాలయాల్లో చికెన్ వాడకం దాదాపు తగ్గించారు. ప్రభుత్వం బర్డ్ ఫ్లూ వల్ల చికెన్ ఉడకపెట్టి తినడం వల్ల మనుషులకు ఏ నష్టమూ లేదని చెబుతున్నా జనాల్లో ధైర్యం రావడం లేదు.. నెల్లూరు జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమకు పెద్ద దెబ్బ తగిలింది. చిత్తూరు నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నారు. ప్రతి రోజూ గతంలో 30 నుంచి 40 వేల కోళ్లు దిగుమతి చేసుకుంటే ప్రస్తుతం 10 వేలకు పడిపోయినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి..



ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

బర్డ్‌ఫ్లూ వైరస్ కోళ్ల పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొద్ది నెలలుగా జిల్లాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కోడి బక్కచిక్కిపోయింది. నెల్లూరు జిల్లాలో డిసెంబర్ నుంచి బర్డ్‌ఫ్లూ వైరస్ సోకింది. విడవలూరు, ఉదయగిరి, కనిగిరి, ఆములూరు, దామర మడుడు, బుచ్చిరెడ్డిపాళెం, గూడూరు, తలమంచి, ప్రాంతాల్లో బాయిలర్,, లేయర్ కోళ్లను పెంచుతున్నారు. అప్పుడప్పుడు వస్తున్న తెగుళ్ల, బర్డ్‌ఫ్లూ వంటి వైరస్‌లతో పౌల్ట్రీ పరిశ్రమ తీవ్రంగా దెబ్బతింటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని బాయిలర్, లేయర్, నాటు కోళ్ల పై తీవ్రమైన ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. ఉదయగిరి ప్రాంతంలో సుమారు లక్ష కోళ్లు, దామరమడుగు ఎస్ఎస్ చికెన్‌కు సంబందించి పెంచుతోన్న కముజు పిట్టలు 40 వేల వరకు చనిపోయాయి. . ప్రస్తుతం వ్యాపారంలోని అనేక మంది రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు కోళ్ల ఉత్పత్తి నిలిచిపోయింది.. కృష్ణా, పశ్చిమ గోదావరి నుంచి గతంలో కోళ్లు జిల్లాకు వస్తుండగా అక్కడ బర్డ్‌ఫ్లూ ప్రభావం తీవ్రంగా ఉండడంతో దిగుమతులు నిలిపేవారు.

భారీగా అమ్మకాలు, ధరలు పతనం..!

జిల్లాకు ప్రస్తుతం చిత్తూరు జిల్లా నుంచే అత్యధిక శాతం కోళ్లు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రతి రోజూ చిత్తూరు, కృష్ణగిరి, గంగాధర్‌నెల్లూరు, పుంగనూరు ప్రాంతాల నుంచి నెల్లూరుకు 40, నుంచి 50 వేల కోళ్లు దిగుమతి చేసుకుంటున్నారు. ధరలు భారీగా పతనం అయ్యాయి. బుధవారం చికెన్ మార్కెట్‌లో బాయిలర్ కేజీ రూ. 184, స్కిన్ లెస్ రూ.206, ఫారం మాసం రూ.166 గా ఉంది. నెలరోజుల క్రితం వరకు కేజీ బాయిలర్ రూ.210-220 మధ్యలోనే ఉంటున్నాయి. బర్డ్‌ఫ్లూ కారణంగా ఒక్కసారిగా కేజీపై రూ.40 వరకు తగ్గాయి. ఆదివారం ఒక్కరోజు లక్ష కోళ్ల వరకు అమ్మకాలు జరుగుతుండగా, దాదాపు సగానికి పైగా అమ్మకాలు పడిపోయనట్లు వ్యాపారులు చెబుతున్నారు. జిల్లా వ్యాపితంగా చికెన్ వ్యాపారులు దిగాల పడుతున్నారు. ప్రభుత్వం బర్డ్‌ఫ్లూ ఉన్నా ఉడకపెట్టి చికెన్ తింటే ఏం కాదని చెబుతున్నా అది ప్రజల్లో భయాన్ని తీయలేకపోతుంది. నగరంలోని హరనాథ్‌పురం వద్ద ప్రతి రోజూ వంద కేజీల చికెన్ అమ్మే ఓ దుకాణంలో ప్రస్తుతం కేవలం 20 కేజీలు మాత్రమే విక్రయిస్తున్నారు. ధరలు తగ్గినా జనం చికెన్ కొనుగోలు చేయ డానికి భయ పడుతున్నారు. ఆ నేపథ్యంలో వ్యాపారులు తమ కష్టాలు ఎప్పుడు తీరుతాయా అనే ఎదురు చూస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని కోళ్లకు బర్డ్‌ఫ్లూ లేదని చెబుతున్నా ప్రజలకు నమ్మకం కలగడం లేదు.

ప్రజలకు నాన్‌వెజ్ కష్టాలు..!

బర్డ్‌ఫ్లూ వైరస్ కారణంగా ప్రజలకు చికెన్ కష్టాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వివాహాలు, రిసెప్షన్లు, ఖర్మకృతులు , ఇతర శుభాకార్యాలు జరుగుతున్నాయి. ఏ ఫంక్షన్ ఉన్నప్పటికీ వెజ్,నాన్ వెజ్ భోజనం తమ స్థాయికి తగ్గట్లు పెడుతుంటారు. చికెన్ వినియోగం తగ్గడంతో ప్రతి కార్యక్రమంలోనూ మటన్ బిరియానీ, రొయ్య, చేపలు, పీతలు అంటూ హడావుడి చేస్తున్నారు. చికెన్‌తో చేసే వంటకాలకు కొంత ఖర్చు తక్కువగా ఉంటుంది. ఇప్పుడు పరిస్థితి లేకపోవడంతో జనంపై భారాలు పడుతున్నాయి. శుభకార్యాలకు బడ్జెట్ డబుల్ అవుతుందని చెబుతున్నారు. హోటళ్లలోనూ చికెన్ వంటకాలు భారీగా తగ్గిపోయాయి. అక్కడ మటన్, చేప, రొయ్యలకు డిమాండ్ పెరిగింది. ఇక్కడ బడ్జెట్ అమాంతంగా పెరిగిపోయింది. ప్రతి రోజూ చేపలు, మటన్, రొయ్య స్టాల్‌కు గిరాకీ పెరిగింది. మటన్ కేజీ రూ. వెయ్యి, రొయ్య కేజీ రూ.500, చేప కేజీ రూ.160కి పెరిగిపోయింది. సామాన్యులకు అందుబాటులో ఉండే చికెన్‌కు వైరస్ రావడంతో సామాన్యులకు భారాలు తప్పడం లేదు. 15 సంవత్సరాల క్రితం బర్డ్‌ఫ్లూ వచ్చినప్పుడు డాక్టర్ జెట్టి శేషారెడ్డి నేతృత్వంలో కోళ్ల వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేసి, చికెన్ తిని ఏం కాదని నిరూపించారు. ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయాల్సి ఉంది.

'యాక్సిస్ ఎనర్జీ' కంపెనీ ఒప్పందం రద్దు చేయాలి

-విద్యుత్ ఉత్పత్తి పేరుతో భారీ కుంభకోణం
-సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి పేరుతో తీవ్రమైన కుంభకోణం, ఆర్థిక భారం, రైతులను, వినియోగదారులను ఇద్దరిని ముంచి మోసం చేసే దిశగా ప్రభుత్వం అగ్రిమెంట్లు చేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నెల్లూరు నగరంలోని డాక్టరు రామ చంద్రారెడ్డి భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెన్యువల్ ఎనర్జీ పేరుతో (సంప్రదాయేతర వనరులైన) సౌరశక్తి,గాలి, నీటితో పంపుడ్ స్టోరేజీ ఐడల్ ప్రాజెక్ట్లు తదతర వాటితో హ్యూబ్రీడ్ విద్యుత్తు ప్రాజెక్టులను పెట్టేందుకు రైతుల నుంచి వేలాది ఎకరాల భూమిని అడ్డగోలుగా తీసుకుంటు న్నారన్నారు. రైతులకు మాత్రం ఏడాదికి రూ.30వేలు అందజేస్తారన్నారు. అదే పొలంపై ఏడాదికి రూ.2 నుంచి రూ.5 కోట్ల వరకు లబ్ధిపొందుతారన్నారు. యాక్సిస్ ఎనర్జీ పేరుతో ఉన్న పరిశ్రమ (2018లో స్థాపించబడింది) 2023లో ఎపిఇఆర్‌సి అగ్రిమెంట్‌ను తిరస్కరించిందన్నారు.2024లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిబంధనలు మార్పు చేసుకొని నూతనంగా నిబంధనలు రూపొందించుకొని వాటి ప్రకారం యాక్సిస్ కంపెనీకి అనుమతులు ఇవ్వాల్సిన అవకాశం లేదన్నారు. పాత నిబందనలు రద్దు అయినా, పాతచట్టం రద్దు అయినా, పాతచట్టం ప్రకారం పునరుద్దరించి అధిక మొత్తం చెల్లించి యాక్సిస్ ఎనర్జీ కంపెనీతో విద్యుత్ ఒప్పందం కుదుర్చుకుందన్నారు.. రూ.2.49 పైసలు సోలార్ ఎనర్జీ పేరుతో అదానితో కుదుర్చుకున్న ఒప్పందం ఒక పెద్ద కుంభకోణమన్నారు. దీనిని రద్దు చేయాలని సిపిఎం ఓ పక్క డిమాండ్ చేస్తుంటే దానిని పట్టించుకోకుండా యాక్సిస్ ఎనర్జీ కంపెనీకి రూ.4.23 పైసలకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చు కుందన్నారు. విద్యుత్ డిమాండ్‌ను ఎక్కువగా చూపించి, అత్యవసర కొనుగోళ్లు చేసి దాదాపుగా రూ.2 లక్షల కోట్లు మేరకు ప్రజలపై అదనపు భారం మోపిందని వైసిపి ప్రభుత్వం విమర్శించిందని గుర్తు చేశారు. . గత ప్రభుత్వ హయాంలో అదానికి రూ.1750 కోట్లు లంచం ఇచ్చి ఒప్పందం చేసుకున్నారన్నారు. మరి ఈ ప్రభుత్వంకు ఈ ఒప్పందం వల్ల ఎంత మేరకు ముట్టిందన్నారు. . విద్యుత్ అదనం అవసరం లేకపోయినా 4 వేల మెగావాట్ల ఒప్పందం చేసుకునేందుకు రాష్ట్ర కేబినెట్ అనుమతులిచ్చిందన్నారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోనే కాకుండా అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, కడప, ఆథోని, నంద్యాల జిల్లాల్లో వేలాది ఎకరాల భూములను రైతుల నుంచి ప్రభుత్వం తీసుకుందన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని హామీలిచ్చిన సంగతి మరిచి ఏడాది పాలనకూడా పూర్తికాక ముందే ఈ ప్రభుత్వం రూ.16వేల కోట్లు ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం ఎంత వరకు న్యాయమన్నారు. సోలార్, గ్రీన్ ఎనర్జీ పేరుతో జరుగుతోన్న హైబ్రీడ్ దోపిడీని (విద్యుత్తు హైబ్రీడ్ దోపిడీ) నివారించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర కమిటీ కార్యాచరణ రూపొందించుకొని విద్యుత్తు ఒప్పందాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ఆలయాలను వ్యాపార దృష్టితో చూడటం హిందూమతానికి ద్రోహం చేయడమే

అంతర్జాతీయ దేవాలయాల నిర్వహణ సదస్సు జరుగుతుందని, ఐ.టి.సి. ఎక్స్పో పేరుతో దేవాలయాలపై ప్రభుత్వం నియంత్రణ అవసరం లేదన్న వితండవాదాన్ని ఈ ప్రభుత్వాలు తీసుకొస్తు న్నాయన్నారు. తిరుమల కేంద్రంగా రూ.2.5 లక్షల కోట్లు వ్యాపారం జరుగుతోందని బి.జె.పి. నేత అన్నామలై తిరుపతిలో చేసిన వాఖ్యలు దుర్మార్గ మన్నారు. ఆయన దేవాలయాన్ని వ్యాపారం కేంద్రంగా చూపి హిందూమతాన్ని కించపరచడం కాదా అని ప్రశ్నించారు. దేవాలయాన్ని వ్యాపార దృష్టితో చూడటం హిందూమతానికి ద్రోహం చేయడమే నన్నారు. దేవాలయాన్ని వ్యాపార కేంద్రాలుగా మార్చే పద్ధతిని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు.. కోవూరు సుగర్ ఫ్యాక్టరీ మూత కారణంగా 400 మంది ఉద్యోగులు, కార్మికులు, రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. గడచిన పదేళ్లలో ప్రభుత్వం వారికి పని చేసిన కాలానికి సంబంధించి 23 కోట్ల రూపాయల బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. కార్మికులు, ఉద్యోగులు కాళ్ళు అరిగేలా అధికారులు, ఎంఎల్ఎల చుట్టూ తిరుగుతున్నా, రకరకాల పద్ధతిలో ప్రయత్నిస్తున్నా ప్రయోజనంచేకూరడం లేదన్నారు. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లోని సుగర్ పరిశ్రమల బకాయిలు (అనకాపల్లి,తాండవ,చిత్తూరు, తిరుపతి)రైతులు, కార్మికులు పోరాడి తమ బకాయిలు సాధించుకున్నారన్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో ఇంకా అందలేదన్నారు. తక్షణం ప్రభుత్వ స్పందించి వారి బకాయిలు వెంటనే చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

అగ్రిగోల్డ్ డిపాజిట్లు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలి

, అగ్రిగోల్డ్ భూములను విక్రయించి ఎవరి డిపాజిట్లు వారికి చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించినా ప్రభుత్వం పరిష్కరించకుండా యజమానులతో లాలూచిపడి స్థానిక టిడిపి నాయకులు ఎక్కడికక్కడ ఆ భూములు కాజేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. వరికుంటపాడు మండలంలోని అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్ల అక్రమ నరికి తరలించిన విషయాన్ని పరిశీలించేందుకు వెళ్లిన సి.పి.ఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యకర్తలపై ఆ ప్రాంతంలోని మాఫియా దాడి చేయడం దుర్మార్గమన్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు ఇద్దరి నడుమ రాజీ చేసి పంపించారు. మినహా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోలే దన్నారు. సి.పి.ఐ నాయకులపై దాడిచేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. . సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, కె.అజయ్‌కుమార్, మూలి వెంగయ్య, ఎం.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టిలకు ఇళ్ల స్థలాలివ్వాలి


ప్రజాశక్తి-కందుకూరు:మండలంలోని కొండికందుకూరు కుంట పోరంబోకు భూమిలో నివసిస్తున్న నిరుపేద ఎస్‌టి కుటుంబాలకు తగిన ప్రదేశంలో స్థలం కేటాయించి నివేశన పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య కోరారు.బుధవారం కందుకూరు సబ్ కలెక్టర్‌ని సర్పంచ్ కలిసి వినతిపత్రం ఇచ్చారు. కందుకూరు మండలంలోని కొండి కందుకూరు పంచాయతీకి చెందిన సర్వేనెంబరు 146/2 లోని 4.17 ఎకరాల కుంట పోరంబోకు భూమిగా ఉంది. ఏడాదిన్నర క్రితం జరిగిన రీసర్వేలో కూడా సదరు భూమి కుంట పోరంబోకుగా నిర్ధారించబడింది. ఆ కుంట పోరంబోకు భూమిలో దాదాపు 30 గిరిజన యానాది కుటుంబాలు గుడిసెలు వేసుకొని గడిచిన ఏడేళ్లుగా నివసిస్తున్నాయి. గతంలో వేరే గ్రామంలో ఉండి ఏడేళ్ళ క్రితం కూలీపనుల కోసం కొండి కందుకూరు గ్రామానికి వచ్చి ఇక్కడే స్థిరపడిపోయారు. నివసించేందుకు అప్పుడు ఆ కుటుంబాల వారు తాత్కాలికంగా కుంట పోరంబోకు భూమిలో గుడిసెలు వేసుకోవడం జరిగింది. నిరుపేద గిరిజన యానాది కుటుంబాలకు మేలు చేకూర్చేలా వారికి కుంట పోరంబోకు తదితర నిషేధిత భూములలో కాకుండా ఇప్పటికైనా తగిన ప్రదేశంలో నివసించడానికి భూమి కేటాయించి, నివేశన పట్టాలను మంజూరు చేయించి, పక్క గహాలను నిర్మించాలని బ్రహ్మయ్య కోరారు. సాధ్యమైనంత త్వరగా ఆ నిరుపేద గిరిజన యానాది కుటుంబాలకు న్యాయం చేసి కుంట పోరంబోకు భూమిని కాపాడాని కోరారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకుడు

గిరిజనుల ఆందోళన


ప్రజాశక్తి-గుడ్లూరు:గుడ్లూరులో ఉన్న గంధర్వ గిరిజన కాలనీలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలను మెయిన్ పాఠశాలలోకి విలీనం చేయరాదని సిఐటియు ఆధ్వర్యంలో గిరిజనులు ఎంఇఒ కార్యాలయం దగ్గర బుధవారం ఆందోళన చేశారు. గిరిజన విద్యార్థు లను విద్యకు దూరం చేయరాదని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వ 117 జీఓ తీసుకువచ్చి వేలాది పాఠశాలను మూసివేసి పిల్లలకి చదువు దూరం చేసిందని ప్రత్యామ్నాయం పేరుతో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం కూడా విద్య వ్యవస్థని వేరేసే పని చేయడానికి పూనుకుందన్నారు. ఎస్సీ గిరిజన పాఠశాలను యథావిధిగా ఉంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, పాలకీర్తన నాగేశ్వరరావు, సునంద, అనూష, కవిత ఎంఇఒకు వినతిపత్రం సమర్పించారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

1న న్యాయ విద్యార్థుల సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు: విజయవాడలో న్యాయ విద్యార్థుల సదస్సు మార్చి 1వ తేదీన నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో న్యాయవిద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని నెల్సా అధ్యక్ష, ఉపాధ్యక్షుల కె.ప్రియ, రవిలు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని విఆర్ న్యాయ కళాశాలలో ఈ సదస్సును విజయవంతం చేయాలంటూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలు విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో మార్చి 1న రాష్ట్ర స్థాయి న్యాయ విద్యార్థుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు .ఈ సదస్సును ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గా ప్రసాద్ ప్రారంభిస్తారు.సదస్సులో న్యాయ విద్యార్థులకు పలు అంశాలపై, ప్రముఖుల చేత శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.పర్సనాలిటీ డెవలప్మెంట్, న్యాయ వృత్తిలో రాణించడానికి మెలకువలు, ఆర్బిట్రేషన్, మీడియేషన్, న్యాయ విద్యార్థుల కెరీర్‌కు ఉపయోగపడే పలు అంశాలను వివరిస్తారు.నెల్లూరు న్యాయ కళాశాల విద్యార్థులు, సదస్సుకు హాజరయ్యేందుకు 9885137475,8125713050 నెంబర్లను సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.న్యాయ విద్యార్థులకు ఉపయోగపడే సదస్సులో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో న్యాయ విద్యార్థులు ప్రియాంక, రవి, సాయి, ఆసిఫ్, వినయ్, జ్యోతి, పావని, సుమేధ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం

ప్రజాశక్తి-నెల్లూరు:నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తూ మృతి చెందిన బర్రె యేసు కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే దిశగా ఆలోచన చేసి మృతుడి కుమారుడు బర్రె చిన్నను కారుణ్య నియామకం చేపట్టారు. అందులో భాగంగా బర్రె చిన్నకు 54వ డివిజన్‌లో పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా విధులను కేటాయిస్తూ కమిషనర్ సూర్య తేజ ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం కారుణ్య నియామకం పత్రంను బర్రె. చిన్న కమిషనర్ నుంచి అందుకున్నారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ ప్రదర్శిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. చైతన్య పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-కందుకూరు:టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కందుకూరులో మొదటి సంవత్సరం బికాం కంప్యూటర్ అప్లికేషన్ చదువుతున్న శాలినికి ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల ఒంగోలు వారు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో 1116 ల బహుమతి లభించింది. రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు అనే అంశంపై ఈనెల 8న నిర్వహించిన వ్యాసరచన పోటీలో 400 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో తమ కళాశాల విద్యార్థిని షాలిని బహుమతి సాధించడం ఎంతో సంతోషమని, అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రవికుమార్ తెలియజేశారు. కళాశాల అధ్యాపక బందం షాలిని అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ప్రోత్సహించారు.



బహుమతి అందజేస్తున్న దృశ్యం

శాసనమండలి మాజీ చైర్మన్‌కు వినతి

ప్రజాశక్తి-కందుకూరు

మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్‌ని హేతువాద సంఘం వారు కలసి గుడ్లూరు మండలం, చేవూరు చెరువుపోం ంబోకు, అటవీభూములను రామదూత అనే ఒకదొంగస్వామి ఆక్రమించి గత 25 సంవత్సరాలుగా ఆశ్రమం పేరుతో మోసంచేస్తూ న్నాడని వినతి పత్రం ఇచ్చారు. అక్రమణభూమిని ప్రభుత్వం స్వాధీనంచేసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. షరీఫ్ కలెక్టరు తో మాట్లాడగా పోర్టు కోసం భూములు కావాలి, వీటిని కూడా అందులో కలిపేస్తామని చెప్పారు. ఈసమాధానం సమంజసంగా లేదు.ఏదోఅడిగాడు కాబట్టి ఏదొకటిచెప్పాలి కదా !అలాచెప్పి నట్లుగాఉంది హేతువాద సంఘం నాయకులు నార్నె వెంకట సుబ్బయ్య తెలిపారు.హేతువాదసంఘం పోరాటపలితంగా 2021 లో పిన్సిపల్ సెక్రటరీ ఉషారాణి కలెక్టరు పెట్టిన అలయ్ నేషన్ రద్దుచేసి, అక్రమణ భూమిని స్వాధీనం చేసుకోవాలని 2021 ఏప్రిల్‌లో అదేశం ఇచ్చింది .నాలుగుసం వత్సరాలైనా ఇంతవరకు అతీగతీ లేదని వినతి పత్రంలో పేర్కొన్నారు.కనుక తక్షణమే ముఖ్యమంత్రి చొరవతీసుకుని గుడ్లూరుమండలం లో దొంగస్వామి ఆక్రమించిన చెరువుపోరంబోకును , అనాథపిల్లల స్కూలు పేరుతో నాటకాలుడుతున్న అటవీభూమి కి సంభందించిన జిఒను రద్దుచేసి భూములను స్వాధీనం చేసుకోవాలని వినతిపత్రంలో కోరారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకుడు

కమిషనర్‌ను కలిసిన సైనిక అధికారి

ప్రజాశక్తి-నెల్లూరు:నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. సూర్య తేజను జిల్లా సైనిక అధికారి జి. హరికృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం జిల్లా సైనిక అధికారి నగరపాలక సంస్థ కార్యాలయంలోని చేరుకొని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఉన్న కమిషనర్‌ను కలిసి పూలమొక్క తోపాటు క్యాలెండర్ బహూకరించారు.



.'బుర్రా'ను కలిసిన ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి-కందుకూరు: నియోజకవర్గ వైసిపి వికలాంగుల విభాగం అధ్యక్షులు బద్దిపూడి ప్రభాకరరావు బుధవారం వైసిపి కార్యాలయంలో మాజీ శాసన సభ్యులు బుర్రా మధు సూదన యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, వైఎస్‌ఆర్‌సీపీ గ్రీవెన్ సెల్ అధ్యక్షులు యరమాల నాగభూషణం,ప్రముఖ కవి డా. బద్దిపూడి జయరావు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు:మండలంలోని కొండముడుసు పాలెం, కంచరగుంట గ్రామంలో మండల వ్యవసాయాధికారి వి.రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రతి రైతుకీ ఒక ప్రత్యేక విశిష్ట సంఖ్య(యూనిక్ నెంబర్) ఇవ్వడం ద్వారా వ్యవసాయాన్ని సులభతరం చేసి పారద ర్శకంగా సేవలను అందించడం కోసం చేయబడుతున్న బృహత్తరమైన రైతు ప్రత్యేక విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం అని తెలియజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి సుశీల," తుమ్మా .కోటేశ్వరమ్మ, పొడపాటి మహేశ్,గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



ఆశీర్వదిస్తున్న దృశ్యం

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు:టౌన్ వైసిపి నాయకులు వల్లూరు కోటేశ్వరరావు,వసత లక్ష్మీల కుమార్తె శిరీష,ధీరజ్ కుమార్ వివాహ వేడుకలలో మాజీ ఎంఎల్‌ఎ బుర్రా పాల్గొని వధూ వరులను ఆశీర్వదించారు.ఆయన వెంట వైసిపి నాయకులు పలువురున్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి రవికుమార్

నాయుడుపాలెంలో పొలం పిలుస్తోంది..

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్:మండలంలోని నాయిడుపాలెం, చినలాటరపి రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిం చారు. వ్యవసాయ శాఖ అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎన్.టి.ఆర్ నగర్ పార్కులో మౌలిక వసతులు



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ పరిధిలోని 11 వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలోని మూడు జెండాల సెంటర్ వద్ద ఉన్న ప్రజాపార్కులో గ్రౌండ్ లెవెలింగ్ పూర్తి చేసి, క్రీడా సామగ్రి, పుట్ పాత్, పచ్చదనం, ఆర్చి నిర్మాణం, పెయింటింగ్, వ్యాయామం పరికరాలు, బెంచీల ఏర్పాటు, మొక్కల పెంపకం తదితర మౌలిక వసతులను కల్పించి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తేవాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. 20 లక్షల రూపాయల నిధులతో పార్కులో అవసరమైన అన్ని వసతులను కల్పించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్, నిర్మలా నగర్, వెంగమాంబ నగర్ 1,2, ఎస్.వి.జి.ఎస్. కళాశాల మైదానం తదితర ప్రాంతాలలో కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిను కాలువలలో పూడికతీత పనులు, సిల్టు ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా నిర్వహించా లన్నారు. రోడ్లపై ఉంచరాదని సూచించారు. ఎస్.వి.జి.ఎస్ కళాశాల సమీపంలోని మేజర్ డ్రెయిను కాలువను పి.ఎం.ఎక్స్. మిషన్ వాహనం ద్వారా శుభ్రం చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. కళాశాల మైదానం సమీపంలో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న చెత్త ఏరుకునే వృత్తి వారిని గుర్తించిన కమిషనర్ సంబంధిత ఐ.టీ.డీ.ఏ. అధికారులతో మాట్లాడి వారికి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలని అధికారులకు సూచించారు. డ్రెయిన్ కాలువల సమీపంలోని బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు విపరీతంగా పేరుకుని ఉండటాన్ని గమనించిన కమిషనర్ స్థానిక శానిటేషన్ విభాగం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల విధుల కేటాయింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో గృహ సముదాయాలలో పై అంతస్తులో కేటాయించబడిన తన నివాసాన్ని గ్రౌండ్ ఫ్లోర్ కు మార్చమని ఒక వికలాంగురాలు కోరగా, అందుకు స్పందించిన కమిషనర్ వెంటనే మార్పు చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ రామ్ మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్ను, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ముజాహిద్దీన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్టికల్చర్ ప్రదీప్ కుమార్,టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నగరంలో నేడు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఉదయం 10 గంటలకు ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఫిబ్రవరి 1వ తేదిన పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉందన్నారు. ఈ బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయ, ఉపాధి హామీ పథకం, ఐసిడిఎస్ తదితర పథకాలకు బడ్జెట్ కేటాయింపులో కోత విధించడం దారుణమన్నారు. బడ్జెట్ పట్ల ప్రజా వ్యతిరేకతను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వామపక్షపార్టీలు దశల వారీగా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధపడ్డాయని అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ నిరసన ప్రదర్శనలు చేపడుతున్నట్లు తెలిపారు.

నగరం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య పనుల నిర్వహణను చిత్తశుద్ధితో నిర్వహించి, నగర వ్యాప్తంగా పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా కృషి చేయాలని పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందిని కమిషనర్ సూర్య తేజ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో పారిశుధ్య విభాగంతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని, వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని సూచించారు. షాపులు, హోటళ్లలో వాడేసిన మురుగు నీరు రోడ్లపై పారకుండా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించాలన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చుంచలూరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మన్నెట్టి శివశంకరయ్యను పిలోమ్ ట్రోఫీ సొసైటీ ఆఫ్ ఇండియా వారు తెలుగుతేజం అనే జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. అవార్డును విజయనగర సామ్రాజ్య అధినేత, తెలుగు కవి, ఆంధ్రభోజుడైన శ్రీ కృష్ణ దేవరాయలు వారి 18వ తరం వారసుల రాజమాత లలితారాణి శ్రీ రంగదేవరాయలు చేతుల మీదుగా కర్ణాటకలోని హంపి శ్రీ రాజమాత స్వగృహంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అర్జుణ్ రాజయోగి ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. వీరు రచించిన చారిత్రక గ్రంథాలు, తాళపత్ర గ్రంథ పరిష్కారాలు, ద్వారపు ప్రతిమలు తయారీ విధానానికి గానూ అవార్డుతో సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం శివశంకరయ్య రాజమాతకు తాను తయారుచేసిన శ్రీ కృష్ణ దేవరాయలు ద్వారపు ప్రతిమను అందించగా, ఆసక్తిగా తిలకించి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాల ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం లభించడంపై గ్రామస్తులు, సహచర ఉపాధ్యాయులు హర్షంవ్యక్తం చేస్తూ వారిని అభినందించారు.

పలువురుకు పరామర్శ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని ఇటీవల మరణించిన పలు కుటుంబాలను బుధవారం మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన మొదటగా హసనాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన, రాజకీయ సొసైటీ మాజీ డైరెక్టర్ కల్లూరు ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను, పరామర్శించారు. అనంతరం మండల కేంద్రమైన పేటలో ఇటీవల అకాల మరణం చెందిన వైసిపి టౌన్ బిడ్ వార్డు సభ్యుడైన కొల్లా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తదనంతరం గుడిపాడు పంచాయతీలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ చిట్టిరెడ్డి వెంకటేశ్వర్లు మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయనవెంట మండల కన్వీనర్ పందిళ్ళపల్లి సుబ్బారెడ్డి, జెడ్‌పిటిసి పి.రాజేశ్వరమ్మ, ఎపిపి బొయిళ్ళ పద్మజా రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులైన సయ్యద్ సందాని భాషా, మాజీ ఎంపిటిసి షేక్ ముజీర్, నాయకులు జకీర్, హుమయున్, షౌకత్, రియాజ్, నేలపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండ..

ప్రజాశక్తి-దుత్తలూరు : మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన నిరుపేద మహిళ మెట్టెం భాగ్యమ్మ కుటుంబంలో ముగ్గురు పిల్లలు పుట్టి అంగవైకల్యంతో సతమతమవుతున్న విషయం ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు తెలియగా, వెంటనే ఆ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం మరో కుమారుడుకు యువ ప్రాతిపదికన దుత్తలూరు మండల పరిషత్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగాన్ని కల్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులందరూ ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌కు ధన్యవాదాలు తెలియజేస్తూ తమ కృతజ్ఞతలు చాటుకున్నారు.

నేడు, రేపు పత్రాలు పరిశీలన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం, కాపు, కమ్మ రెడ్డి, వైశ్య, ఈబిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు, బ్యాంక్ మేనేజర్ సమక్షంలో 20, 21 తేదీలలో పరిశీలన ఉంటుందని స్థానిక ఎంపిడిఒ ప్రసన్నకుమారి తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న వారు ఎంపిడిఒ కార్యాలయంలో 10. 30గంటలకు బ్యాంక్ మేనేజర్ సమక్షంలో జరుగు పరిశీలనకు కచ్చితంగా హాజరు కావాలని తెలియజేశారు.

టిబివ్యాధి నివారణకు అవగాహన

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని జెబిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో బుధవారం విద్యార్థులకు టిబివ్యాధి నివారణపై, అది ఏ విధంగా సంక్రమిస్తుందో అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలో ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఉచితంగా ఈ వ్యాధిని సంబంధించిన నిర్ధారణ పరీక్షలను సమీపంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రంలో గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గానీ ఉచితంగా చేస్తారన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ బి.నాగరాజు, సూపర్వైజర్లు ఎస్‌కె దిలీప్, ఎస్‌కె ఇలియాజ్, ఎస్‌కె రియాజ్‌లు చిన్నారులకు ఈ టిబి వ్యాధికి సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.శ్రీహరి, ఆరోగ్య పర్యవేక్షకులు టి.హేలీల, జి.ప్రయాంక, వై.పుష్ప, కె.చంద్రకిరణ్, శ్రీనివాసులురెడ్డి, రమ్య, రాధిక, ఆశా కార్యకర్తలున్నారు.

ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి-దగదర్తి : మండలంలోని చెన్నూరు పంచాయతీలో వరికోతలు మొదలు కావడంతో బుధవారం రోడ్డుపైనే ధాన్యం రాసులను తహశీల్దార్ పి.కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యాన్ని లారీ లోడ్ చేస్తుండగా అక్కడికి వెళ్లి ఎంతకు అమ్ముతున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. రూ.18500 అమ్ముతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని ప్రభుత్వం రైతులకు మద్దతు ధర రూ.19720 ఇస్తుందని వారు తెలిపారు.

ఎంఎల్‌ఎ కాకర్ల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు మజరా గ్రామమైన వైకుంఠపురంలో వెలసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రోజు ఆలయ ధర్మకర్తలు పెండ్యాల సూర్యనారాయణ అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ హాజరయ్యారు. ఆయనకు ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ ఆలయ మర్యాదలు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చండ్రా మధుసూదన్ రావు, టిడిపి సీనియర్ నాయకులు సుంకర అంజనాద్రి, జెడ్‌పిటిసి రావెళ్ల నాగేంద్ర, మాజీ మండల కన్వీనర్ చండ్రా వెంకయ్య, క్లస్టర్ ఇంచార్జ్ పోకా మహేష్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, మండల తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పార్థ మధురావు, ఆంధ్ర శివరామిరెడ్డి, సర్పంచ్ వెంగళరావు, సుంకర రాధాకృష్ణ, మల్లె హరి నారాయణ, జనసేన మండల అధ్యక్షుడు పవన్ రసూల్, గుర్రం గోపి, దేవినేని ప్రసాద, గడుపూడి మురళీకృష్ణ, పెండ్యాల వెంకటనారాయణ పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి-కావలి : కావలి ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఆంగ్ల (ఇంగ్లీషు) అధ్యాపకురాలు శ్రీదేవి చౌదరికి అరుదైన గౌరవం లభించింది. ఆమె రచించిన "కమ్యూనికేషన్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ (రిజిస్ట్రేషన్ నెం: 1935/G.600/119/2023), బిజినెస్ కమ్యూనికేషన్(రిజిస్ట్రేషన్ నెం:1936/G.600/120/2023) అనే రెండు పుస్తకాలను ఏపి ప్రభుత్వ పౌర గ్రంథాలయ శాఖ 2022-23 విద్యా సంవత్సరంలో గ్రంథాలయాలలో ఉన్నతస్థాయి సమావేశంలో ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కళాశాల ఛైర్మన్ రాజ్ కుమార్ చౌదరి, ప్రిన్సిపాల్ టి.ఉమ, పలువురు అధ్యాపకులు, రచయితలు, పరిశోధకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని అప్పారావుపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతు రిజిస్ట్రేషన్ పోర్టల్, ప్రతి సొంత భూమి ఉన్న రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిఎ అర్చన, రైతులున్నారు.

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో త్వరలో వరి కోతలు ప్రారంభమవుతున్నాయని దానిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరు మండలం గంగవరం, ముండుగుంట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు చైతన్య, చాదిక్, రైతులు ఉన్నారు.

'శ్రీ చైతన్య'లో మెగా జాబ్‌ఫెయిర్

ప్రజాశక్తి-కావలి : కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ జాబ్ ఫెయిర్‌లో కోల్ మాన్ ,పేస్ సెట్టర్స్, ఎం.ఎస్.ఎన్. కంపెనీలు పాల్గొన్నాయి. ఈ మెగా జాబ్ ఫెయిర్‌లో కళాశాలకు సంబంధించి, డిగ్రీ పూర్తిచేసిన దాదాపు 80మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 26మందికి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.జనార్దనరావు, అకడమిక్ ప్రిన్సిపాల్ పి.వి.రావు, కళాశాల నాక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవికాంత్, కంప్యూటర్ లెక్చరర్ కవీర్, ఫిజికల్ డైరెక్టర్ తిరుపాల్, ఎస్.ఎస్.ఎస్. ప్రోగ్రాంఆఫీసర్ పి.సాయితేజ, అధ్యాపక, అధ్యాపకేతరసిబ్బంది అభినందించారు.

ఎంఎల్‌ఎ పికెట్ పరామర్శ

ప్రజాశక్తి-కావలి : కావలి ఎంఎల్‌ఎ వ్యక్తిగత సహాయకులు మామిడాల సాయికుమార్‌కు మేడ సంబంధిత శస్త్ర చికిత్స జరిగి, కావలిలోని వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకొనే సందర్భంగా స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు షేక్.కాదర్ బాషా ఆధ్వర్యంలో ఆ సంఘం నిర్వాహకులు, సాయికుమారున్ని పరామర్శించారు. కార్యక్రమంలో వరల్డ్ వైడ్ స్వర్ణకార సంస్థ గౌరవ అధ్యక్షులు షేక్. బాషా, లక్ష్మమ్మ ఫౌండేషన్ ఎంఎల్‌ఎ ఫౌండేషన్ ప్రధానోపాధ్యాయులు ఎం.అజిత్ బాబు, హృషి సేనాపంపు సయ్యద్ ఫనిషాప్, సయ్యద్ సేనాపంపు జి.సురేంద్ర, ఉపాధ్యాయల నీరజ, పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల్లో కలప తరలింపు

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిఎస్‌పికి అగ్రిగోల్డ్ పరిరక్షణ కమిటీసభ్యుల ఫిర్యాదు



డిఎస్‌పి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి

కావలి అగ్రిగోల్డ్ భూములలో కలప అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం అగ్రిగోల్డ్ పరిరక్షణ కమిటీ సభ్యులు డిఎస్‌పి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. వరికుంటపాడు మండలం కనియంపాడు, బాప్పునాపురం గ్రామాలలో అగ్రిగోల్డ్ భూములలో రూ.కోట్ల విలువ చేసే జామాయిల్ తోటను యథేచ్ఛగా నరికి, సొమ్ము చేసుకుంటున్నారన్నారు. కొన్ని రోజులుగా జరుగుతున్న దోపిడీపై అధికారులు పట్టించుకోలేదన్నారు. స్థానిక పత్రికల్లో వచ్చిందన్నారు. సమాచారం తెలుసుకొన్న అగ్రిగోల్డ్ పరిరక్షణ కమిటీ జిల్లా సభ్యులు అగ్రిగోల్డ్ బాధితులతో కలసి జనవరి 5వ తేదీన కనియంపాడు గ్రామంలో కొట్టి ఉన్న జామాయిల్ చెట్లను పరిశీలించి, తహశీల్దారుకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఉన్నత అధికారులకు సమాచారం అందించా మని రెవెన్యూ, పోలీసు, సిఐడి, అధికారులు మొక్కుబడిగా పరిశీలించి వెళ్లారని ఆరోపిం చారు. 2014లో టిడిపి ప్రభుత్వం అగ్రిగోల్డ్ భూములు జప్తు చేసిందని, అగ్రిగోల్డ్ భూములలోకి ఎవరూ ప్రవేశించకుండా బోర్డులు పెట్టిందన్నారు. వరికుంటపాడు అగ్రిగోల్డ్ భూములలో జామాయిల్, ఎర్ర చందనం, మామిడి ఇతర చెట్లు ఉన్నాయని తెలిపారు. జామాయిల్‌కు గిరాకీ ఎక్కువగా పెరగడంతో ప్రభుత్వం పెట్టిన బోర్డులు తొలగించి జామాయిల్ చెట్లను నరికి, లారీలతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నార న్నారు. అధికారులు అక్రమంగా జామాయిల్ తరలిస్తుంటే నివారించ లేదన్నారు. 18వ తేదీన అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్య దర్శి దామా అంకయ్య, పి.తిరుపతి రావు, టి సుబ్రమణ్యం, యు.రామదాసు 60మంది బాధితులు అగ్రిగోల్డ్ భూములను పరిశీలించగా, గతంలో కొట్టి ఉన్న జామాయిల్ ఎత్తుకెళ్లిపోయారన్నారు. జామా యిల్ కొట్టి, అక్రమంగా తరలించవద్దు అని మంగళవారం అగ్రిగోల్డ్ అస్తుల పరిరక్షణ కమీటి సభ్యులు భాదితులు వరికుంటపాడు తహశీల్దారు కార్యలయం ఎదుట అందోళ చేశారన్నారు. జనవరి 5వ తేదీన ఫిర్యాదు చేశామని ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం ఏమిటని నిలదీశారు. తహశీల్దారుకు పరిరక్షణ కమిటీ సభ్యులు, అగ్రిగోల్డ్ బాధితులు తిరిగి నెల్లూరుకు వస్తుండగా మార్గం మధ్యలో తమ వెనక వస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు రామ దాస్ సుబ్రమణ్యం టెంపోను ఆపి, శ్రీకాంత్ యాదవ్ అతని అనుచరులు విచక్షణ రహి తంగా కొట్టి, మరోసారి ఈ ప్రాంతానికి వస్తే చంపేస్తామని బెదిరించారన్నారు. తిరుపతి రావును చొక్కా పట్టుకొని కిందపడి పోయా డని తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నిరాంత్ దానికి ప్రయత్నంగా కంట్రోల్ కాక పోగా, తగిన సిబ్బంది లేదని అగ్రిగోల్డ్ పరిరక్షణ సభ్యులను నెల్లూరు పంపించారని తెలిపారు. జామాయిల్ అక్రమ రవాణా అపాలని, ప్రభుత్వ ఆస్తులను రక్షించ డానికి ప్రయత్నిస్తున్న తమపై దౌర్జన్యం చేసిన శ్రీకాంత్‌యాదవ్, అతని అనుచరులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా న్నారు. కార్యక్రమంలో మాజీ అగ్రిగోల్డ్ పరిరక్షణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతి రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, జిల్లా అధ్యక్షులు ఎస్.శంకరయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి టి.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు పి.కృష్ణయ్య, సిపిఐ నాయకులు బలిజేపల్లి వేంకటేశ్వర్లు, డమ్ము దర్గాబాబు, కె.నాగరాజు, సిపిఎం నాయకులు తాళ్ళూరు మాల్యాద్రి, మారుపూడి రాధాకృష్ణ, పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



ఎఎస్‌పేటలో తహశీల్దారు అర్జీ ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలపాలిట శాపంగా మారిందని, రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం చేకూరే విధంగా ప్రవేశపెట్టలేదని సిపిఎం మండల కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో తహశీల్దారుకు అర్జీ ద్వారా తెలియజేశారు. అనంతరం జిల్లా కొలు రైతు సంఘం నాయకులు గంట లక్ష్మీపతి తదితరులు మాట్లాడుతూ జీవిత కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి, విద్య, వైద్య రంగాలకు బడ్జెట్ కేటాయింపులు చాలా స్వల్పంగా ఉన్నాయన్నారు. ఈ బడ్జెట్ పేదలు సంపాదించుకున్న సొమ్మును, పెట్టుబడిదారులకు దోచి పెట్టే విధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఆదేవిధంగా ఈ బడ్జెట్లో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఊసే లేదని, ఈ బడ్జెట్‌పై అధికారపక్షం, ప్రతిపక్షం స్పందించక పోవడం విచిత్రంగా ఉందన్నారు. ఎస్‌సి ఎస్‌టి కుటుంబాలకు, నిరుపేదలకు, పెట్టుబడీదారీలకు జిఎస్‌టి విధించడం ఒకే విధంగా ఉండడం చాలా దుర్మార్గపు చర్య అని, కావున ఈ విషయాన్ని గుర్తించి వెంటనే బడ్జెట్ను సవరించి, పేదలకు ఉపయోగపడేలా రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మాజీ కార్యదర్శి సయ్యద్ అస్లాం, సిపిఎం నాయకులు సలాం, తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు ఉపయోగకరమైన బడ్జెట్ కాదని ఎల్‌ఐసి రాష్ట్ర యూనియన్ సెక్రటరీ నరేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని చెర్లో రమణ రెడ్డి భవన్ (సిపిఎంకార్యాలయంలో) ప్రజా వ్యతిరేక బడ్జెట్ ప్రత్యామ్నాయ విధానంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త నరేష్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు విద్యకు గానీ అనుకూలమైన బడ్జెట్ కాదని భారతదేశంలో మొత్తం మీద గ్రామీణ ఉపాధిహామీ పథకానికి చాలా తక్కువశాతం బడ్జెట్ కేటాయించారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిదినాలు తగ్గే పరిస్థితి ఉంది కాబట్టి పేద ప్రజలు ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళ్లే పరిస్థితి ఉందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నిలబెట్టుకునే పరిస్థితి లేదని, విశాఖపట్నం రైల్వేజోన్ ఎటువంటి బడ్జెట్ కేటాయించలేదన్నారు. పేదల ప్రయాణం చేసే రైళ్లు తగ్గించారని, ఏలేరు ఉండే వందేమాతరం రైళ్లు ప్రవేశపెట్టారని తెలిపారు. అంతేకాకుండా రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించలేదని ఎరువుల సబ్సిడీ ఎత్తివేయడంతో రైతాంగం దెబ్బతినే పరిస్థితి ఉందని తెలిపారు. కార్యక్రమం లో సిపిఎం జిల్లా నాయకులు గంటా లక్ష్మీపతి, సీనియర్ నాయకులు షేక్ సందాని, వాగాల శ్రీహరి, ఆళ్ళ హాజరత్తయ్య, ఐద్వా నాయకురాలు గుల్జార్‌బేగం, గద్దర్‌బాబు తదితరులున్నారు.

సైన్స్ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : సైన్స్ పోటీ పరీక్షల షెడ్యూల్‌ను కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాలు ఫిబ్రవరి 21వ తేది నుండి 28వ తేదీ వరకు వివిధ అంశాలలో సైన్స్ పోటీ పరీక్షలు కావలి పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సైన్స్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవం (29-02-2025) నాడు సాయంత్రం 3 గంటల నుండి బహుమతి ప్రదానం జరుగుతుందని తెలియజేశారు. కావున పాఠశాలల యజమానులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు సహకరించి ఈ కార్యక్రమం జయప్రదం చేయవలసిందిగా ప్రకటనలో కోరారు.

రీసర్వే పరిశీలన

ప్రజాశక్తి-సంగం : మండలంలోని కొరిమెర్ల కండ్రిక గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్ కింద జరుగుతున్న రీసర్వేను బుధవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్ పరిశీలించారు. రీసర్వే జరుగుతున్న తీరు గురించి తహశీల్దార్ సోమ్లానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన రైతులతో మాట్లాడారు. రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 35 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. భూములకు సంబంధించిన పట్టాదారులకు నోటీసులు అందజేసి రీసర్వే ప్రక్రియను జరుపుతున్నామన్నారు. జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వెల్లడించారు. ఆర్‌డిఒ పావని, డిఎస్‌ఎల్ఒ నాగ శేఖర్, సర్వేయర్ శివరంజని, ఆర్ఐ సల్మా, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: మాజీమంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎస్ఆర్‌జె డిగ్రీ కాలేజీ ఇండోర్ స్టేడియంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి మెమోరియల్ షటిల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు మాజీ జెడ్‌పిటిసి ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షులు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద రెడ్డి, యువ నాయకుడు నోటి వినయ్ కుమార్ రెడ్డి, ఆండ్రా సుబ్బారెడ్డి, వెంగళ్ రెడ్డి, చిల్లూరు వెంకటేశ్వర్లు, బాల అంకయ్య పాల్గొన్నారు.

మాజీమంత్రి కాకాణి పర్యటన

ప్రజాశక్తి-పొదలకూరు : మండలంలోని కళ్యాణపురం, పొదలకూరు గ్రామాలతో పాటు, వెంకటాచలం మండలం, చవటపాళెం గ్రామాలలో బుధవారం మాజీ మంత్రి, జిల్లా వైసిపి అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈ క్రమంలో టిడిపి వారు అక్రమంగా ఆక్రమిస్తున్న పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను, వారు ఇళ్లు కట్టుకున్నా సరే.. మన ప్రభుత్వం రాగానే, అసలైన లబ్ధిదారులకు తిరిగి అప్పజెబుతామని భరోసానిచ్చారు. జగనన్న పాలనలో అర్హులందరికీ పార్టీలకతీతంగా పెన్షన్లు పంపిణీ చేస్తే, తెలుగుదేశం పాలనలో ప్రతినెల కోతలు పెట్టడం అలవాటుగా మారిందన్నారు. కళ్యాణపురం గ్రామంలో వైసిపి నాయకులు యత్తపు లక్ష్మణ రెడ్డి, పార్థీవదేహానికి నివాళు లర్పించడంతో పాటు, పొదలకూరు మండల కేంద్రంలో ఇటీవల మరణించిన విశ్రాంత ఉపాధ్యాయుడు నరసాపురం సుబ్బయ్య, బెల్లంకొండ ఆదిలక్ష్మమ్మల కుటుంబ సభ్యులను, వెంకటాచలం మండలం, నిడిగుంటపాళెం గ్రామానికి చెందిన నెల్లూరు తులసిరామ్, లోక్‌నాథ్ సింగ్, చవటపాళెం గ్రామానికి చెందిన తాళ్లపాక నరసయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-విడవలూరు : విడవలూరు పిఆర్ఆర్అండ్‌విఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు సాఫ్ట్బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ మొదలకు పోటీలను విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల క్రీడాధికారి కన్వీనర్ ఎ వి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ భాషోత్సవం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : భావవ్యక్తీకరణకు భాష కీలకమని ప్రధానోపాధ్యాయులు చింతంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం హిందీ భాషోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, హిందీ ఉపాధ్యాయులు మున్వర్‌అహ్మద్, వేదవతి, వేణు, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎంకె పార్కును శుభ్రం చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని లక్ష్మణరావు పల్లి ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయల సమీపంలో ఉన్న ఎస్ఎంకె పార్కును అపరిశు భ్రంగా ఉందని దానిని శుభ్రం చేయించి ప్రజలకు యువతకు అందుబాటులోకి తీసుకురావాలని బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ లకు ఎల్ఆర్‌పల్లి సిపిఎం శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు షేక్ సంధాని మాట్లాడుతూ లక్ష్మణరావుపల్లి ప్రాంగణంలో ఉన్న ఎస్ఎంకె పార్కు గతంలో యువత, ఆటలు ఆడుతూ, వయోవృద్ధులు సేద తీర్చుకునేవారని, ప్రస్తుతం ఈ పార్కు చుట్టూ కోర్టు భవనం, ట్రెజరీ, రిజిస్ట్రేషన్ ఆఫీస్, సబ్‌జైల్, తదితర కార్యాలయాలు ప్రస్తుతం ఎస్ఎమ్‌కె పార్క్ కంప చెట్లతో చెత్తాచెదారంతో నిండి ఉందన్నారు. కాబట్టి పార్కును శుభ్రపరచి ప్రజలకు అందుబాటులోకి తేవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, కృష్ణమోహన్, వెంకటరెడ్డి, తదితరులున్నారు.

వ్యాపారులకు అండగా ఉంటా..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

రోడ్డు మార్జిన్, తోపుడు బండ్లపై వర్తకం చేసుకునే చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా అండగా ఉంటామని ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డి హామీనిచ్చారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఆమె చిరు వ్యాపారులతో సమావేశమయ్యారు. స్థానిక చెన్నూరు రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా, ప్రజలు ఇబ్బంది పడకుండా తోపుడు బండ్లు, రోడ్డు మార్జిన్ వ్యాపారులు సహకరించాలని సూచించారు. ప్రస్తుతానికి తమవ్యాపారాలు కొనసాగించుకోవచ్చని మార్కెట్ నిర్మాణం పూర్తయిన వెంటనే అందరూ అక్కడికి వెళ్లాలని ఆమె ఆదేశించారు. ఆటో డ్రైవర్లు విచ్చలవిడిగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఆమె తప్పు పట్టారు. చెన్నూరు రోడ్డులోని ఆటో స్టాండ్‌ను గిరిజ హాల్ వద్దకు తరలించి సీరియల్ ప్రకారం బస్టాండ్ సెంటర్‌కు వచ్చి ఆటోలను తరలించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయిల బెడద యూట్యూజింగ్‌కు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించే విధంగా విద్యార్థినీలు ఎక్కువగా ఉండే విద్యాసంస్థల వద్ద మహిళా కానిస్టేబుళ్లతో నిఘా ఏర్పాటు చేసి బాలికలకు రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా, వైస్ చైర్మన్లు యర్రట పల్లి శివకుమార్‌రెడ్డి, నస్రీంఖాన్, పట్టణ, మండల అధ్యక్షులు ఎంవి శేషయ్య, బత్తల హరికృష్ణ, పలువురు కౌన్సిలర్లు, ఎస్ఐ సంతోష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

స్వర్ణకారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కావలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో కావలిని కాస్మోసిటీగా మారుస్తానని, కావలిలోని స్వర్ణకారుల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎ.వి.ఎస్ కళ్యాణ మండపంలో జరిగిన కావలి స్వర్ణకారుల నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎకు స్వర్ణకారులు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు ఇచ్చి, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ స్వర్ణకారుల సంఘం భవనానికి తనవంతు కృషి చేస్తామన్నారు. తనకోసం ఎన్నికల్లో శ్రమించిన వ్యక్తి తన శిష్యుడు హుస్సేన్ స్వర్ణకారుల సంఘానికి అధ్యక్షుడు కావడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు కృషి, సహకారంతో కావలి పట్టణంను కాస్మో సిటీగా అభివృద్ధి చెందుతుందన్నారు. కావలి పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 600 షాపుల నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టబోతు న్నామని తెలిపారు. ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ముందు షాపుల నిర్మాణాలలో స్వర్ణకారులకు ప్రాధాన్యతను ఇవ్వబోతున్నామ తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ కర్రీ వేణుమాధవ్, కావలి పట్టణ స్వర్ణకార సంఘ ప్రెసిడెంట్ షేక్.హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ పి.నటరాజ్ ఆచారి, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, టిడిపి సీనియర్ నాయకులు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, మహా జనసేన అధ్యక్షుడు చేపూరి సురేంద్ర, ప్రధానకోశాధికారి పి.దస్తగిరి, కోశాధికారి షేక్.మహబూబ్ బాషా, కార్యనిర్వాహక అధికారి షేక్.రసూల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి

నేడు కేంద్ర బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు బజార్ సెంటర్‌లో గురువారం ఉదయం వామపక్షాల పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని మండల కార్యదర్శి గండవరపు బుజ్జయ్య ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు, ప్రజాతంత్ర వాదులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

రెండు పొగాకు బ్యారెన్లు దగ్ధం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని నందవరం కూడలి వద్ద రెండు పొగాకు బ్యారెన్‌లు అగ్నికి ఆహుతయ్యాయి. బ్యారెన్‌లో పొగాకు అల్లిన కర్రను క్యూరింగ్ కోసం ఉంచడంతో క్యూరింగ్ సమయంలో ప్రమాదవశాత్తు ఆకులు రాలి గొట్టాలపై పడడంతో మంటలు వ్యాపించి బ్యారెన్లలో ఉన్న పొగాకు మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.9లక్షలు ఆస్తి నష్టం వాటిల్లి నట్టు బాధిత రైతులు వాపోయారు. ఘటనా స్థలానికి చేరుకొని పక్క బ్యారెన్‌లకు మంటలు వ్యాపించకుండా ఆత్మకూరు, మర్రిపాడు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

నేటినుండి ఆధార్ స్పెషల్‌క్యాంప్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలో గురువారం ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, ఈ క్యాంపులో 0 నుండి 6యేళ్ల పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు చేయడం, ఆధార్‌లో చేర్పులు మార్పులు చేస్తామని ఎంపిడిఒ పి.ప్రసన్నకుమారి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20వ తేదీన ఆనుమ సముద్రం, గుడిపాడు, చిరమణ గ్రామాలు, 21వ తేదీన ఎఎస్‌పేట వన్, టూ, శ్రీ కొలను, రాజవోలు, 22వ తేదీన జమ్మవరం, కేఎం కొండూరు, అనుముసముద్రంపేట బిట్ వన్, టు, 24వ తేదీన గుంపర్లపాడు, పెద్ద అబ్బీపురం, ఏఎస్పేట వన్ టు, 25వ తేదీన కావలి ఎడవల్లి, సిబివరం, ఏఎస్పేట వన్ టూ గ్రామ సచివాలయాల నందు ఆధార్ స్పెషల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తులు

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-25 సంవత్సరం 5వ తరగతి చదువుకు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్లో అప్లై చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీన ఉదయం 10 గటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

వాహనదారులకు ఎస్ఐ సూచనలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని వినాయక్ సెంటర్లో ద్విచక్ర వాహనదారులకు ఎస్ఐ సైదులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో, హెల్మెట్ లాక్ చేసుకోవడం కూడా అంతకన్నా ముఖ్యమని తెలిపారు. అదేవిధంగా రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలో మూడు రోజులపాటు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణలో అందరూ పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కోర్స్ డైరెక్టర్ ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు, సిడిపిఒ ఎస్.సునీత తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో రెండోరోజు జరుగుతున్న అంగన్ వాడీల శిక్షణ తరగతులో వారితోపాటు సూపర్వైజర్ తేజస్విని పాల్గొని వారు మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా పిల్లలు తల్లులు ఆరోగ్యం, పౌష్టిక ఆహారం విషయాలలో తగిన ఉత్తమ విధానాలు ఎలా అలవర్చుకోవాలో తెలిపారన్నారు. ముఖ్యంగా శిక్షణ ద్వారా నేర్చుకున్న విషయాలను వారివారి అంగన్‌వాడీ సెంటర్లలో అమలు పరచాలని తెలియజేశారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ సుబ్బారెడ్డి, ఫణిరాజ్, సారధి అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కోవూరు : పూర్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరనాయక్ అన్నారు. కోవూరులోని జెబిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తూ చిన్నారుల్లో ఉత్సాహం నింపాలన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేసేలా ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఇంకా ఈ శిక్షణ శిబిరంలో మండల విద్యాశాఖ అధికారులు రహీమ్, వై.చెంచులక్ష్మమ్మ, రిసోర్స్‌పర్సన్లు శ్రీనివాసులు, మహేంద్ర, సూపర్‌వైజర్లు రాధిక, ప్రసన్న లక్ష్మిలు పలు సూచనలు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం ముసునూరు 15వ వార్డులో మంగళవారం రాత్రి ఎసిలో షార్ట్ సర్క్యూట్ జరిగి దాసరి వెంకటనరసయ్య అనే వ్యక్తి ఇంటి 2వ అంతస్థులో ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. జనరేటర్‌ల రిపేర్ వర్క్ చేసుకునే దాసరి వెంకట నరసయ్య ఎసిలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. అగ్ని ప్రమాదం కారణంగా సుమారు 17 సవర్ల బంగారం, రూ.6లక్షల నగదు, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాక సిబ్బంది వచ్చి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకుని హుటా హుటిన ఘటనా స్థలానికి ఎంఎల్‌ఎ వెంకట క్రిష్ణారెడ్డి వచ్చి, పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

లబ్ధిదారుల పత్రాలు పరిశీలన

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలకు సంబంధించి రుణాలకు గానూ బ్యాంకులకు దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల సమక్షంలో వారి పత్రాలను నిశిత పరిశీలన చేసే కార్యక్రమాన్ని కోవూరు ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇటీవల వివిధ పథకాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పత్రాలను బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో పరిశీలించామన్నారు. అర్హులైన జాబితాను 10 రోజుల్లో ప్రకటించేలా చర్యలు తీసుకో వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిజిబి మేనేజర్లు చరణ్ కుమార్, విజయకుమార్, తదితరులున్నారు.

ప్రజాశక్తి -ఉదయగిరి : సబ్సిడీ లోన్‌లకు 322 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారని ఇంటర్వ్యూలకు 196 మంది మాత్రమే హాజరయ్యారు అయ్యారని ఎంపిడిఒ అప్పాజీ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక స్త్రీశక్తి భవనంలో ఆయా శాఖల బ్యాంక్ మేనేజర్లతో ఇంటర్వ్యూలు నిర్వహించి దరఖాస్తులను పరిశీలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బలహీన వర్గాలకు జీవనోపాధి కోసం ప్రభుత్వం సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వ్యక్తిగత బ్యాంకు తదితర వివరాలను అడిగి తెలుసుకుందామన్నారు. త్వరలోనే రుణ మంజూరుపై ఆయా బ్యాంకుల వారు సమాచారం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ, కెనరా బ్యాంక్, ఉదయగిరి గండిపాలెం ఎపిజిబి మేనేజర్‌లు జూనియర్ అసిస్టెంట్ సమద్ ఎండి ఆపరేటర్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుత్తలూరు : బిసి కార్పొరేషన్ ద్వారా మండలానికి కేటాయించిన సబ్సిడీ రుణాలకు సంబంధించి బుధవారం స్థానిక మండల పరిషత్ ద్వారా నిర్వహించిన ఇంటర్వ్యూలకు 140మంది హాజరయ్యారు. ఎంపిడిఒ మీసాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. మొత్తం 248 మంది దరఖాస్తు చేసుకోగా 140 ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఎంపిక చేసిన జాబితాను త్వరలో ప్రకటిస్తామని ఎంపిడిఒ తెలిపారు.

ప్రజాశక్తి-వింజమూరు : రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో స్వయం ఉపాధి కోసం బిసి, ఇతర కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలకు అన్ని గ్రామాల ప్రజల నుండి స్వీకరించబడిన దరఖాస్తులను పరిశీలన కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో మొత్తం 44 రుణా లకు గానూ 377 దరఖాస్తులు రావడాన్ని పరిశీలించారు. ఈ దరఖాస్తులను మరల పునా పరిశీలించి బ్యాంకర్ల సమక్షంలో వీరిలో లబ్ధిదారులను గుర్తించి రుణాలు మంజూరు చేస్తామని ఎంపిడిఒ తెలియజేశారు. కార్యక్రమంలో మండల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.